# మనం రోజూ పాటించే ఈ అలవాట్లు గుండె ఆరోగ్యాన్ని ఎలా దెబ్బ తీస్తాయో తెలుసా..?



మనం హాని కలిగించవు అనుకునే అనేక అంశాలు గుండె ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయని వైద్యులు చెబుతున్నారు. మనకు హాని చేయవు అని అనిపించే అలవాట్లు మన ఆరోగ్యంపై దీర్ఘకాలిక ప్రభావాలను చూపుతాయి. ఆహారం తీసుకునే విషయంలో మనం చేసే పొరపాట్లు, నిద్రించే సమయంలో చేసే పొరపాట్లు, మన దినచర్యలో మనం చేసే పొరపాట్లు మన గుండె ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. కానీ ఈ అలవాట్లను మనం చాలా తేలికగా తీసుకుంటాం. ఈ అలవాట్ల కారణంగా మన గుండె ఆరోగ్యం దెబ్బతింటుందన్న సంగతి కూడా మనలో చాలా మందికి తెలియదు. మన రోజువారి అలవాట్లు అసలు మన గుండె ఆరోగ్యాన్ని ఎలా దెబ్బతీస్తాయో.. ఇప్పుడు తెలుసుకుందాం.

### నిద్ర..

మన శరీరం, మనసు పనిచేయడానికి నిద్ర చాలా అవసరం. రోజూ తగినంత నిద్రించకపోవడం వల్ల రక్తపోటు, శరీర బరువు పెరగడం, మానసిక ప్రశాంతత లేకపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. రక్తపోటు పెరగడం వల్ల గుండె జబ్బులు, స్ట్రోక్ వంటి గుండె సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కనుక రోజూ తగినంత విశ్రాంతి తీసుకోవడం చాలా అవసరం. రోజుకు 6 నుండి 8 గంటల పాటు నాణ్యమైన నిద్రపోవడం వల్ల గుండె ఆరోగ్యంతో పాటు శరీర ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. ఇక మారిన జీవనశైలి కారణంగా చాలా మంది రోజంతా కూర్చొని ఉద్యోగాలు చేస్తున్నారు. కుర్చీలో అయినా, డ్రైవింగ్ సీట్ లో అయినా, సోఫాలో అయినా ఎక్కువ సమయం కూర్చోవడం వల్ల హృదయ ఆరోగ్యం దెబ్బతింటుంది. పగటిపూట ఎక్కువ సమయం కూర్చొనే వారిలో హృదయ సంబంధ వ్యాధులు ఎక్కువగా వస్తాయని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇక గుండె ఆరోగ్యం దెబ్బతినడానికి ఒత్తిడి కూడా ఒక ముఖ్యకారణం.

### ఒత్తిడి..

దీర్ఘకాలిక ఒత్తిడి గుండె ఆరోగ్యంతో పాటు శరీర ఆరోగ్యాన్ని కూడా దెబ్బతీస్తుంది. ఒత్తిడి కారణంగా ఛాతిలో నొప్పి, మానసిక సమస్యలు, గుండె జబ్బులు, పేగుల ఆరోగ్యం దెబ్బతినడం వంటి అనేక సమస్యలు తలెత్తుతాయని వైద్యులు చెబుతున్నారు. కనుక ఒత్తిడిని తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. యోగా, శ్వాస వ్యాయామాలు, ధ్యానం వంటివి చేయడం వల్ల ఒత్తిడి తగ్గుతుంది. తద్వారా గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. అలాగే మన ఆహార అలవాట్లు కూడా గుండెపై ఒత్తిడి కలిగేలా చేస్తాయి. కెఫిన్ ఎక్కువగా ఉండే ఆహారాలు, చక్కెర ఉండే ఆహారాలను తీసుకోవడంతో పాటు అల్పాహారాన్ని తీసుకోకపోవడం, వేగంగా భోజనం చేయడం వంటి అలవాట్లు కూడా గుండె ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయని వైద్యులు చెబుతున్నారు.

### ఇతరుల ఆరోగ్యమేనా..?

అంతేకాకుండా మనం ఎల్లప్పుడూ అందరి కోసం కాకుండా మన శరీర ఆరోగ్యం కోసం కూడా ఆలోచించాలి. కొందరు తమ ఆరోగ్యం కంటే ఇతరుల గురించి ఎక్కువగా ఆలోచిస్తూ తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేసి అనారోగ్యానికి గురి అవుతారు.

కనుక ఇతరులు, కుటుంబ సభ్యుల గురించి ఆలోచించడంతో పాటు మన శరీర ఆరోగ్యాన్ని కాపాడుకునే ప్రయత్నం చేయాలి. ఈ విధంగా మనం హాని కలగవు అని భావించే చిన్న చిన్న విషయాలే మన హృదయ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయని కనుక ఈ అలవాట్లను మానుకునే ప్రయత్నం చేయాలని వైద్యులు సలహా ఇస్తున్నారు.



## ఈ ఆహారం తిన్నారంటే

# ఫుల్ ఎనర్జీ..

ప్రతి ఒక్కరూ శరీరం దృఢంగా, ఎనర్జీ లెవెల్స్ తగ్గకుండా ఉండాలని కోరుకుంటారు. కానీ, ఈ బిజీ లైఫ్ స్టైల్, ఆహారపు అలవాట్లు, పొల్యూషన్ కారణంగా శరీరం చాలా బలహీనపడుతుంది. చాలా మంది మెట్లు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు, ఎక్కువ సేపు ఏదైనా పని చేసినప్పుడు త్వరగా అలసిపోతుంటారు. శరీరం త్వరగా అలసిపోకుండా రోజంతా మిమ్మల్ని ఉత్సాహంగా ఉంచే ఆహారాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

### 1. తృణధాన్యాలు:

బ్రౌన్ రైస్, రాగులు, ఓట్స్, జొన్నలు వంటి తృణధాన్యాల్లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇవి రక్తంలోని చక్కెర స్థాయిని స్థిరంగా ఉంచి, మీకు ఎనర్జీ లెవెల్స్ అందిస్తాయి.

### 2. డ్రై ఫ్రూట్స్, విత్తనాలు:

బాదం, వాల్‌నట్స్, చియా విత్తనాలు, గుమ్మడి గింజల్లో మెగ్నీషియం, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి మెదడును చురుగ్గా ఉంచి అలసట రానివ్వవు.

### 3. గుడ్లు:

గుడ్లలో ఉండే 'ల్యూసిన్' అనే అమినో యాసిడ్ కణాలకు శక్తిని అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. మిమ్మల్ని రోజంతా ఎనర్జీగా ఉండేలా చేస్తాయి.

### 4. పెరుగు:

పెరుగులో ఉండే ప్రోబయోటిక్స్ జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. జీర్ణక్రియ బాగుంటే శరీంలో తక్కువ శక్తిని ఖర్చు చేస్తుంది. దీనివల్ల మీరు వెంటనే అలసిపోకుండా ఉంటారు.

### 5.అరటిపండ్లు:

అరటిపండులో గ్లూకోజ్, సుక్రోజ్, ఫ్రక్టోజ్ వంటి సహజ చక్కెరలు పుష్కలంగా ఉంటాయి. అంతేకాదు పొటాషియం కూడా ఎక్కువగా ఉంటుంది. కండరాల పనితీరు మెరుగ్గా ఉంచడానికి దోహదపడుతుంది.


## కడుపులో మంట, గ్యాస్ తగ్గడానికి తీసుకోవాల్సిన ఆహారమిదే..

కడుపులో మంట అనేది మనం తీసుకునే ఆహారం, జీవనశైలిపై ఆధారపడి ఉంటుంది. కడుపులో మంట కంట్రోల్ చేసేందుకు అప్పటికప్పుడు ఎన్నో రకాల మందులు, సిరప్‌లు తీసుకుంటుంటారు. మంచి ఆహారం తీసుకుంటే ఎలాంటి కడుపు మంట ఉండదని వైద్య నిపుణులు చెబుతున్నారు.

మజ్జిగ: మజ్జిగలో కొంచెం వాము లేదా జీలకర్ర పొడి కలుపుకొని తాగితే కడుపు మంట తగ్గి చల్లగా అనిపిస్తుంది. ఇందులో ఉండే లాక్టిక్ యాసిడ్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.

- చల్లని పాలు: ఒక గ్లాసు చల్లని పాలు చక్కెర లేకుండా తాగితే కడుపులో ఉపశమనం కలుగుతుంది.
- కొబ్బరి నీళ్లు: ఇందులో ఉండే పొటాషియం శరీరంలోని ఆమ్లతత్వాన్ని తగ్గించి, పీహెచ్ స్థాయిని సమతుల్యం చేస్తాయి.
- అరటిపండు: ఇది సహజ సిద్ధమైన 'యాంటాసిడ్' లా పనిచేస్తుంది. పండిన అరటిపండు ఇంకా మంచిది.
- పుచ్చకాయ: ఇందులో నీటి శాతం ఎక్కువగా ఉండటం వల్ల శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచి మంట తగ్గిస్తుంది.
- సోంపు: భోజనం తర్వాత కొద్దిగా సోంపు గింజలు నమలడం వల్ల గ్యాస్, మంట తగ్గుతుంది
- అల్లం టీ: ఇందులో యంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. చిన్న అల్లం ముక్కను నీటిలో మరిగించి తాగితే ఉపశమనం కలుగుతుంది.
- తులసి ఆకులు: రోజూ రెండు, మూడు తులసి ఆకులు నమలడం వల్ల కడుపులో ఆమ్ల స్థాయి తగ్గుతుంది.





## రాత్రి పడుకునే ముందు నీళ్లు తాగడం మంచి అలవాటేనా?

రాత్రి పడుకునే ముందు నీళ్లు తాగే అలవాటు చాలా మందికి ఉంటుంది. నీరు ఆరోగ్యానికి ఎంత ముఖ్యమో అందరికీ తెలిసిందే. రోజూ సరిపడా నీరు తాగితే శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. కానీ పడుకునే ముందు నీరు తాగడం మంచిదా? కాదా? అనే సందేహం చాలా మందికి ఉంటుంది. నిజానికి ఈ అలవాటుకు కొన్ని ప్రయోజనాలు ఉన్నప్పటికీ, జాగ్రత్తలు తీసుకోకపోతే నిద్రకు అంతరాయం కలగొచ్చని నిపుణులు చెబుతున్నారు. అయితే పడుకునే ముందు నీరు తాగితే కలిగే లాభాలు ఏమిటి? ఎక్కువగా తాగితే వచ్చే సమస్యలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం..

### పడుకునే ముందు నీరు తాగడం..


పడుకునే ముందు నీరు తాగితే శరీరంలోని విష పదార్థాలు బయటకు వెళ్లడానికి సహాయపడుతుంది. రక్తప్రసరణ మెరుగుపడుతుంది. శరీరం చల్లబడుతుంది, మంచి నిద్ర వస్తుంది. గోరువెచ్చని నీరు తాగితే కండరాల నొప్పులు తగ్గుతాయి, జీర్ణక్రియ బాగా జరుగుతుంది. నిమ్మరసం కలిపిన నీరు తాగితే రోగనిరోధక శక్తి పెరుగుతుంది, చర్మానికి మెరుపు వస్తుంది.

### ఎక్కువ నీరు తాగితే వచ్చే సమస్యలు..

పడుకునే ముందు ఎక్కువగా నీరు తాగితే రాత్రిపూట తరచూ మూత్రానికి వెళ్లాల్సి వస్తుంది. దీనివల్ల నిద్ర భంగం కలుగుతుంది. సరైన నిద్ర లేకపోతే అలసట, తలనొప్పి, ఏకాగ్రత తగ్గడం వంటి సమస్యలు వస్తాయి. ఇది దీర్ఘకాలంలో ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### నిపుణుల సూచనలివే..

- నీరు తాగిన వెంటనే నిద్రపోవడం మంచిది కాదు.
- పడుకునే ముందు కనీసం 1--2 గంటల ముందు నీరు తాగడం మంచిది.
- రాత్రి భోజనం చేసిన కొంతసేపటి తర్వాత నీరు తాగితే జీర్ణక్రియ మెరుగుపడుతుంది.
- దాహం వేస్తే ఎక్కువ నీరు తాగడం కాకుండా కొద్దిగా సిప్ తీసుకోవడం మంచిది.
- నీరు ఆరోగ్యానికి ఎంతో అవసరం. కానీ పడుకునే ముందు నీరు తాగేటప్పుడు సరైన సమయం, పరిమితి పాటిస్తేనే మంచి ఫలితం ఉంటుంది. అలా చేస్తే ఆరోగ్యం కూడా బాగుంటుంది, అలాగే ప్రశాంతమైన నిద్ర పడుతుంది.



## రోజంతా హెడ్‌ఫోన్స్ పెట్టుకుంటున్నారా?

ఈ రోజుల్లో చాలా మంది గంటల తరబడి హెడ్‌ఫోన్స్ లేదా ఇయర్‌ఫోన్స్ ఉపయోగిస్తున్నారు. మొబైల్, ల్యాప్‌టాప్, కాల్స్, మీటింగ్స్, పాటలు వినడం... ఇలా హెడ్‌ఫోన్స్ రోజువారీ జీవితంలో భాగమయ్యాయి. కానీ ఎక్కువసేపు హెడ్‌ఫోన్స్ వాడితే చెవుల ఆరోగ్యంపై ప్రభావం పడుతుంది.

ఆరోగ్య నిపుణుల ప్రకారం, అధిక వాల్యూమ్‌లో పాటలు వినడం, నాణ్యత లేని ఇయర్‌ఫోన్స్ వాడటం, గంటల తరబడి హెడ్‌ఫోన్స్ వాడడం వల్ల వినికిడి శక్తి క్రమంగా తగ్గే ప్రమాదం ఉంది. చాలాసార్లు మొదటి లక్షణాలను మనం పట్టించుకోం.. కానీ చెవి నొప్పి, బరువుగా అనిపించడం, చిన్న శబ్దం కూడా ఇబ్బందిగా అనిపించడం లాంటివి భవిష్యత్తులో వచ్చే సమస్యలకు సంకేతాలు కావొచ్చు.

### ఏం చేయాలి?

- నిపుణుల ప్రకారం, హెడ్‌ఫోన్స్‌ను సరైన విధంగా ఉపయోగించడం చాలా ముఖ్యం.
- ఎప్పుడూ మితమైన వాల్యూమ్‌లో పాటలు లేదా కాల్స్ వినండి.
- హెడ్‌ఫోన్స్ ఎక్కువసేపు వాడకుండా మధ్య మధ్యలో విరామం తీసుకోవాలి.
- చెవులకు ఒత్తిడి కలిగించని, మంచి నాణ్యత గల హెడ్‌ఫోన్స్ ఎంచుకోవాలి.
- చెవులను శుభ్రంగా ఉంచుకోండి. కానీ పదునైన వస్తువులతో శుభ్రం చేయొద్దు.
- అవసరం లేని సమయంలో హెడ్‌ఫోన్స్ తీసేసి చెవులకు విశ్రాంతి ఇవ్వండి.
- ఏదైనా అసౌకర్యం ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించండి.
- చెవులను నిర్లక్ష్యం చేస్తే వచ్చే సమస్యలివే..
- చెవులపై శ్రద్ధ పెట్టకపోతే వినికిడి లోపం వచ్చే అవకాశం ఉంది.
- చెవుల్లో రింగింగ్ శబ్దం..
- నొప్పి లేదా బరువుగా అనిపించడం..
- చెవి ఇన్ఫెక్షన్లు..
- నిద్ర, ఏకాగ్రతపై ప్రభావం..

### ముఖ్య సూచనలు..

- అధిక వాల్యూమ్‌లో పాటలు వినొద్దు.
- గంటకు ఒకసారి హెడ్‌ఫోన్స్ నుంచి విరామం తీసుకోండి.
- చెవులను పొడిగా, శుభ్రంగా ఉంచండి.
- దెబ్బతిన్న ఇయర్‌ఫోన్స్ వాడొద్దు.
- సమస్య ఉంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించండి.

